ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 21: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో వాయిదా పడిన ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్ష తేదీని ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. దీంతో ఆరోజు జరగాల్సిన అన్ని పరీక్షలను అధికారులు వాయిదా వేశారు. ఈ పరీక్షను తిరిగి వచ్చే నెల 16న నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష సమయం, పరీక్ష కేంద్రంలో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

టెక్ మహేంద్ర అకాడమీ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణ

అమీర్‌పేట్, సెప్టెంబర్ 21: సీఎస్ఆర్ బాధ్యతల్లో భాగంగా టెక్ మహేంద్ర స్మార్ట్ అకాడమీ (హైదరాబాద్) తరపున నిరుద్యోగ యువతకు సప్లై చైన్ మేనేజ్‌మెంట్, వేర్‌హౌస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో స్కాలర్‌షిప్‌తో కూడిన ప్లేస్‌మెంట్ సహకారాన్ని అందిస్తోంది. ఐటీఐ, డిగ్రీ, పీజీ కలిగి 19 నుంచి 28 ఏండ్ల యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. సెప్టెంబర్ చివరి వారంలో ప్రారంభమయ్యే బ్యాచ్‌లో చేరుదరఖాస్తు చేసుకోవచ్చు. ఎర్రగడ్డ రైతుబజార్ (మెట్రో పిల్లర్ నంబర్ ఎ-980) ఎదురుగా సెయింట్ థెరిస్సా చర్చి కంపౌండ్‌లోని టెక్ మహేంద్ర స్మార్ట్ అకాడమీ ఫర్ లాజిస్టిక్స్ కార్యాలయంలో అప్లికేషన్లు అందజేయాలన్నారు. వివరాలకు 73373 32606లో సంప్రదించాలని ప్రాజెక్ట్ మేనేజర్ పి.దీప్తి కోరారు.

టాయిలెట్ల తొలగింపు

బేగంపేట్: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం వెనక వైపు ఉన్న మూత్రశాలను తొలగించి స్థానికుల సమస్యను పరిష్కరించారని కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్‌కుమార్, బస్తీవాసులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన బస్తీలో విలేకర్లతో మాట్లాడుతూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ చొరవతో అధికారులు సమస్యను పరిష్కరించారు. తీవ్రమైన దుర్గంధంతో బాధపడుతున్న బస్తీ ప్రజల సమస్య పరిష్కారమైంది. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆఫీసు గది కూల్చివేతపై నిరసన

- ఆందోళన వ్యక్తం చేసిన బీఆర్ఎస్, దళిత సంఘాల నాయకులు
- కార్పొరేటర్‌కు సమాచారం లేకుండా కూల్చివేత

నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 21: బన్సీలాల్‌పేట్‌లోని జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ వద్ద 2017 నుంచి ఉన్న ఆఫీసు గదిని కూల్చివేయడం పట్ల కార్పొరేటర్ కె.హేమలత నిరసన వ్యక్తం చేశారు. శనివారం షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.సుదర్శన్‌బాబు, నగర ఉపాధ్యక్షుడు మహేందర్, సనత్‌నగర్ అధ్యక్షుడు అశోక్, ఎమ్మార్పీఎస్ నగర కార్యదర్శి ప్రభాకర్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్‌రాజు, కె.లక్ష్మిపతి, ప్రేమ్‌కుమార్, నాగభూషణం, కుశాల్, అబ్బాస్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం పేర్లు పెట్టిన మల్టీపర్పస్‌లో వందలాది వివాహాలు, శుభకార్యాలు, సమావేశాలు జరిగాయని అన్నారు. కార్యాలయ గదిని ఎందుకు కూల్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతల ఒత్తిడి మేరకు బీఆర్ఎస్‌కు చెందిన దళిత కార్పొరేటర్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా బల్దియా టౌన్ ప్లానింగ్ సిబ్బంది గదిని కూల్చివేశారని ఆమె ఆరోపించారు. ప్రజాధనం వృథా చేశారని ఆమె అన్నారు. వెంటనే అక్కడ నూతన ఆఫీసు గదిని నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ నేత కుటుంబానికి పరామర్శ

బన్సీలాల్‌పేట్: ఇటీవల మృతి చెందిన భోలక్‌పూర్ బీఆర్ఎస్ మహిళా నేత సుజాత కుటుంబ సభ్యులను శనివారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. పార్టీ కార్యక్రమాల్లో ఆమె చురుగ్గా పాల్గొనేవారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా సుజాత భర్త రవికుమార్, ఇద్దరు కుమార్తెలకు ఆయన ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్‌రాజు ఉన్నారు.

బన్సీలాల్‌పేట్: వినాయక ఉత్సవాలు, నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పర్వదిన ర్యాలీని ప్రశాంతంగా నిర్వహించిన గాంధీనగర్ పీఎస్ ఇన్స్‌పెక్టర్ డి.రాజు, ఎస్సైలను సన్మానించిన బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు

శనిగారపు విజయ్‌కి ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 21: ఓయూ కామర్స్ విభాగంలో శనిగారపు విజయ్ డాక్టరేట్ సాధించారు. డాక్టర్ కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో 'ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ అమాంగ్ ఎంఎస్ఎంఈస్ ఇన్ తెలంగాణ-ఎ సెలెక్ట్ స్టడీ ఆఫ్ ఎర్స్‌వైల్ నల్గొండ డిస్ట్రిక్ట్' అంశంపై పరిశోధన పూర్తిచేసి విజయ్ సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం చౌలమద్ది (మారుతీనగర్)కు చెందిన కుండలు తయారు చేసే కుటుంబంలో జన్మించిన విజయ్ ఉన్నత విద్యలో అత్యున్నత పట్టాను సాధించారు. ఆయన ఇటీవల వెలువడిన గురుకుల లెక్చరర్ ఫలితాల్లో ఉద్యోగం సాధించి, నిజామాబాద్ జిల్లా మోర్తాడు బీసీ గురుకుల జూనియర్ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన పరిశోధనకు సహకరించిన తన సూపర్‌వైజర్ అసోసియేట్ ప్రొఫెసర్ కె.శ్రీనివాస్, కో-సూపర్‌వైజర్, ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసమూర్తి, ఇతర అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

డిసెంబర్‌లో ఓయూలో జాతీయ సదస్సు


సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 21: అసోసియేషన్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ జియో ఫిజిక్సిస్ట్స్ (ఏఈజీ) ఆధ్వర్యంలో డిసెంబర్‌లో జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. సంబంధిత బ్రోచర్‌ను అధికారులతో కలిసి నిర్వాహకులు శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఏఈజీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ బోయిళ్ల వీరయ్య మాట్లాడుతూ డిసెంబర్ 9వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జాతీయ స్థాయి వర్క్‌షాప్, 12, 13 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. 'ఇంజినీరింగ్ జియో ఫిజిక్స్' అంశంపై వర్క్‌షాప్, 'జియో ఎక్స్‌ప్లోరేషన్ ఫర్ క్రిటికల్ మినరల్స్ అండ్ ప్రీషియస్ మెటల్స్' అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు. 46వ ఏఈజీ జాతీయ సమ్మేళనం సందర్భంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. శాస్త్రవేత్తలు, పరిశోధక విద్యార్థులు, పీజీ, యూజీ విద్యార్థులు, అధ్యాపకులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, యూజీసీ డీన్ ప్రొఫెసర్ గడ్డం మల్లేశం, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్, ఏఈజీ సెక్రెటరీ డాక్టర్ బి.నరసింహారావు, అధ్యాపకులు డాక్టర్ ఉదయలక్ష్మి, డాక్టర్ మంజుల, డాక్టర్ విద్యాసాగర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

బాపూజీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించిన వైద్యులు

కంటోన్మెంట్, సెప్టెంబర్ 21: లయన్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ తెలంగాణ ఆధ్వర్యంలో శనివారం న్యూ బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆయన అన్నారు. ప్రతినెల న్యూ సిటీకాలనీ వెంకటేశ్వర ఆలయంలో ఉచిత వైద్యసేవలు నిర్వహిస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు లయన్స్ క్లబ్ భవిష్యత్తులో ఇతర వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూరంపల్లి సురేశ్‌రావు, సెక్రటరీ బి.లక్ష్మణ్, కోశాధికారి తమ్మల నాగేందర్, హెచ్ఎం ఆశీర్వాదం, నారాయణ, ఆరోగ్యం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ అందజేత

విద్యార్థులతో ఈక్షణ ఫౌండేషన్, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అడ్డగుట్ట, సెప్టెంబర్ 21: పేద, మధ్య తరగతి విద్యార్థులకు చేయూత అందించడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యయుడు మల్లికార్జున్ అన్నారు. శనివారం ఈక్షణ ఫౌండేషన్, హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా పాఠశాల విద్యార్థులకు బ్యాగ్స్, స్టేషనరీ అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ సామాజిక సేవలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని అన్నారు. కార్యక్రమంలో ఈక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు, టీచర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

మందులను ఉచితంగా అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 21: తార్నాక డివిజన్ లాలాపేట వినోభానగర్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అప్సా, బ్లూ ఫౌండేషన్, జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్, రెయిన్‌బో హోమ్స్ సంయుక్తంగా కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన ఈ శిబిరంలో ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, జనరల్ ఫిజిషియన్, ఫిజియోథెరపీ వైద్యులు సేవలందించారు. దాదాపు 200 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. భారత్ వికాస్ పరిషత్ ద్వారా 135 మంది మహిళలకు హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, అనీమియా లక్షణాలు ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు కిశోర్, డేనియల్, పార్వతి, అనిత, నీలిమ, దేవమ్మ, మంజుల, నర్సింగ్‌రావు, స్వామి, పరమేశ్, అశోక్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యర్థాలను రోడ్లపై వేస్తే జరిమానా తప్పదు


రోడ్డుపై పడేసిన బయో మెడికల్ వేస్ట్ క్లినిక్ ఓనర్‌కు జరిమానా పత్రాన్ని అందిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

బేగంపేట్ సెప్టెంబర్ 21: జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య శనివారం సిబ్బందితో కలిసి బేగంపేట్ పాటిగడ్డ ప్రాంతంలో పర్యటించారు. అక్కడ హర్షిత క్లినిక్ నడుపుతున్న మహ్మద్ రఫీక్ తాను క్లినిక్‌లో వాడిన బయో మెడికల్ వేస్ట్‌ను రోడ్డుపై వేస్తుండటం గుర్తించారు. దీంతో అధికారులు రూ.25వేల జరిమాన విధించారు. బయో మెడికల్ వేస్ట్‌ను చెత్త తీసుకువెళ్లే వాహనాలకు ఇవ్వాలని సూచించారు. రోడ్లపై ఇలాంటివి వేయరాదని ఎవరైనా వేసినట్టు గుర్తిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది ధనాగౌడ్, కృష్ణ, సాయినాథ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలోకి వరద నీరు

సికింద్రాబాద్, సెప్టెంబర్ 21: సికింద్రాబాద్ చిలకలగూడ కట్ట మైసమ్మ, పోచమ్మ ఆలయంలోకి భారీగా వరద నీరు చేరింది. దీంతో శనివారం భక్తులు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి ఆలయంలోకి వరద నీరు వచ్చిందని చైర్మన్ కృష్ణ తెలిపారు. దీనికి కారణం సరైన మ్యాన్ హోల్స్ లేకపోవడమేనని అన్నారు. గత బోనాల పండుగ సమయంలో కూడా ఇలానే సమస్య తలెత్తిందని చెప్పారు. అప్పుడు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా వరద నీరు సాఫీగా వెళ్లేందుకు మ్యాన్ హోల్స్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

యువకుడు అదృశ్యం

సూర్యతేజ

అడ్డగుట్ట, సెప్టెంబర్ 21: పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడానికి ఊరికి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సబిత వివరాల ప్రకారం సీతాఫల్‌మండి బీదల బస్తీకి చెందిన శ్యామల కొడుకు సూర్యతేజతో కలిసి నివసిస్తున్నది. సూర్య ప్రైవేట్ ఉద్యోగి. ఇదిలా ఉండగా ఈనెల 3న డ్యూటీకి వెళ్లివచ్చాడు. సాయంత్రం తాను పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడానికి నిజామాబాద్‌లోని తమ ఊరికి వెళ్లుతున్నానని తల్లికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. మరుసటి రోజు ఫోన్‌చేస్తే వస్తున్నానని చెప్పాడు. తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆందోళనకు గురైన తల్లి శ్యామల బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసింది. ఫలితం లేకపోవడంతో చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి హత్య

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 21: గుర్తుతెలియని వ్యక్తిని మరో గుర్తుతెలియని వ్యక్తి కర్రతో దాడిచేసి హత్య చేసిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ బి.సాయిఈశ్వర్‌గౌడ్ వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 10వ నంబర్ ప్లాట్‌ఫారం వీఐపీ గేట్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తిని ఓ వ్యక్తి కర్రతో దాడిచేసి హత్య చేశాడు. సమాచారం అందుకున్న రైల్వే ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ సంఘటన స్థలానికి చేరుకొని పలు ఆధారాలు సేకరించారు. హత్యకు గల కారణాలు, హత్య చేసిన నిందితుడి ఆచూకీ కోసం దర్యాప్తును ముమ్మరం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ మధుబాబు

బొల్లారం, సెప్టెంబర్ 21: రాంగ్ రూట్లో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ నార్త్‌జోన్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో, ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు ఆధ్వర్యంలో రాంగ్ రూట్లో వాహనం నడిపిన, పాత చలాన్లు పెండింగ్‌లో ఉన్న వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మద్యం సేవించి, రాంగ్ రూట్లో వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి కవచం బహూకరణ

దాతలను సన్మానిస్తున్న ఆలయ ట్రస్ట్ సలహాదారు, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

కంటోన్మెంట్, సెప్టెంబర్ 21: కంటోన్మెంట్‌లో ప్రసిద్ధి చెందిన బోయిన్‌పల్లి న్యూ సిటీకాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొలువైన గరుడ ఆళ్వార్ విగ్రహానికి భక్తులు శ్రీనివాస్ వీరమణి, ప్రీతిరెడ్డి కవచాన్ని బహూకరించారు. శనివారం ఆలయ ట్రస్ట్ సలహాదారు, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులతో కలిసి కవచం అందజేసిన భక్తులతో పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణ, జగన్నాథం, యాదయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో దాండియా నైట్స్

అమీర్‌పేట్, సెప్టెంబర్ 21: దసరా నవరాత్రులను పురస్కరించుకొని అక్టోబర్ 3 నుంచి కంట్రీక్లబ్ ఆధ్వర్యంలో బేగంపేట్ పోలీస్ హాకీ గ్రౌండ్స్‌లో దాండియా నైట్స్-2024 అలరించనున్నాయి. 10 రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో సరికొత్త రిథమ్‌ల నుంచి సరికొత్త డీజే మిక్స్‌ల వరకు ప్రతిరోజూ దాండియా నృత్య ప్రదర్శనలు జరుగుతాయని సంస్థ సీఎండీ రాజీవ్‌రెడ్డి తెలిపారు. శనివారం కంట్రీక్లబ్‌లో జరిగిన సమావేశంలో పలువురు డీజేలు, గర్బా కొగ్రాఫర్ల ఆధ్వర్యంలో నవరాత్రి సంప్రదాయ గర్భా నృత్యాలు ప్రదర్శించారు.

విద్యుత్ బిల్లులు చెల్లించాలని ప్రచారం

సికింద్రాబాద్, సెప్టెంబర్ 21: విద్యుత్ బిల్లులు చెల్లించాలని అధికారులు విన్నూత్న రీతిలో ప్రచారం చేస్తున్నారు. సీతాఫల్‌మండి మేడిబావిలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని, గడువు ముగిస్తే కరెంట్ కట్ చేయడమే కాకుండా పైన్ కూడా వేస్తామన్నారు. వినియోగదారులను కలిసి బిల్లు టైంలోపే చెల్లించాలని, ప్రతికాలనీ, ప్రతిఇంటికి లైన్‌మెన్లు మైక్ ద్వారా ప్రచారం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటన

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 21: భారీ వర్షాలకు బౌద్ధనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాలు వరద తాకిడికి గురికాగా, బీజేపీ నాయకులు ఆ ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. డివిజన్‌లోని ఎల్.నారాయణనగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లోని ముంపు ప్రాంతాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో బురదనీటిని తొలగించి, దోమల మందు కొట్టి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, సిబ్బంది శ్రీనివాస్, గిరి, బస్తీవాసులు సుధాకర్‌గుప్తా, పార్వతమ్మ, బాలయ్య, సంజయ్‌కుమార్, లింగం తదితరులు పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 21: స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళిలర్పించిన కాంగ్రెస్ నాయకులు ఎం.బాలకృష్ణ, రాజశేఖర్, లవకుమార్, రమేశ్, జగదీశ్ తదితరులు

టీటీఈపై దాడి చేసిన రైల్వే ఉద్యోగి

ఆపై మనస్తాపంతో రైలు కిందపడి ఆత్మహత్య

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 21: రైల్వే టీటీఈపై రైల్వే ఉద్యోగి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు స్టేషన్‌కు పిలిచి నోటీసులు ఇవ్వడంతో తీవ్ర మనస్తాపానికి గురై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం మహేంద్రహిల్స్‌కు చెందిన రమేశ్‌బాబు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వాహణలో భాగంగా సికింద్రాబాద్ నుంచి కాజీపేట వైపు వెళ్తున్న రైల్లో రమేశ్‌బాబు విధుల్లో ఉన్నాడు. చిలకలగూడ రైల్వే క్వార్టర్స్‌లో ఉండే బూడిద నరేశ్ (27) (రైల్వేలో అసిస్టెంట్ ఇంజినీర్)తో పాటు మరో ఇద్దరు ఏసీ కోచ్ రైల్లో ప్రయాణిస్తున్నారు. టీటీఈ రమేశ్ వారిని టిక్కెట్లు అడిగాడు. దీంతో వారి గుర్తింపు కార్డులను చూపించారు. రైల్వే ఉద్యోగులు ఏసీ కోచ్‌లో కూర్చోవద్దని స్లీపర్ క్లాస్‌లో కూర్చోవాలని చెప్పడంతో నరేశ్, టీటీఈకి వాగ్వాదం జరిగింది. సంఘటనను దృష్టిలో పెట్టుకొని ఈనెల 18న అంబేద్కర్‌నగర్ టీచర్స్‌కాలనీ సమీపంలో టీటీఈ రమేశ్‌పై నరేశ్‌తో పాటు మరో ఇద్దరు అడ్డగించి కర్రతో దాడిచేసి పరారయ్యారు. బాధితుడు తుకారం గేట్ పోలీసులకు సమాచారం అందించగా, రమేశ్‌ను మెట్టుగూడలోని రైల్వే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉంది. కేసు నమోదు చేసిన పోలీసులు ఈనెల 20న రైల్వే ఉద్యోగి బూడిద నరేశ్‌కు ఫోన్ చేసి స్టేషన్‌కు రావాలని సూచించారు. నోటీసు ఇచ్చి ఇంటికి పంపించారు. ఈ సందర్భంగా తీవ్ర మనస్తాపానికి గురైన నరేశ్ శనివారం సంజీవయ్య పార్కు-సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.